# తొలి చూపు తొలి రేయి

శీతంరాజు - చిట్టిబాబు



**ఎదురుగా వస్తున్న రిక్షాలో ఒళ్ళో వీణను పెట్టుకుని కూర్చున్న అమ్మాయిని చూసి ముగ్ధుడయ్యాడు రంగనాథం. అందంగా కూడా వుండి అపర సరస్వతిలా వుంది. అంతేకాక ఆ అమ్మాయి, తననే చూస్తున్నట్లనిపించింది.**

రంగనాథానికి వీణానాదం అంటే యిష్టం. వీణ వాయించే అమ్మాయి కదా అని సహజంగా యింకా ఎక్కువ ముచ్చటేసింది.

ఆ రిక్షా, తన సైకిలు రెండు దగ్గరవుతూ వుంటే, ఆ అమ్మాయి సిగ్గుతో తల పక్కకు తిప్పుకుంటున్నట్లు, అతనికి ఆమె సొట్టబుగ్గలు చెప్పకనే చెప్పినై. సైకిలు మీద వున్నాడు గానీ, లేకుంటే మెలికలు తిరిగిపోయేవాడు.

సభ్యతకోసం సైకిలు ముందుకు పోనిచ్చినా, చలించిన మనస్సు దానికి కళ్ళెం వేసి వెనక్కి తిప్పింది. ఆమె గమ్యస్థానం తెలుసుకోవలెననే కుతూహలం ఒక వైపు, మళ్ళీ ఎవరూ తనని చూసి ఏమీ అనుకోకూడదనే తలపు మరోవైపు, అతన్ని స్లో సైక్లింగ్ చేస్తూ రిక్షాను కొద్దిదూరంలో వెంబడించేట్లు చేశాయి.

ఇంటి ముందర రిక్షా దిగేటంతవరకు భారతికి, అందం, ఆకర్షణ కల రంగనాథం ఆహ్లాదకరమైన చూపులు మనోనేత్రంలో కదలాడుతూ, హృదయాన్ని గిలిగింతలు పెట్టినై. మామూలుగా అయితే, అటువంటి అబ్బాయిలు, ఆ రకపు చూపులకు అలవాటుపడ్డా, ఎన్నడూ పట్టించుకోని భారతికి, అప్పుడు ప్రత్యేకంగా ఆనందం కలగటానికి కారణం వుంది. అతని సైకిలుకు టెన్నీస్ రాకెట్ వుంది. టెన్నీసంటే గౌరవమైన ఆటగానే కాక, టీ.వీ.లో టోర్నమెంట్లు చూస్తూ, ఆట మీద ఇంటరెస్టు పెంచుకుంది.

రిక్షాకు డబ్బులిచ్చి కుతూహలంగా తను వచ్చిన రోడ్డు వంక చూసింది. దూరాన సైకిలు పట్టుకుని నిలుచున్న రంగనాథం కనిపించాడు. మర్యాద మనసులో మెదిలి కొంత గర్వం, కొంత భయంతో యింట్లోకి వెళ్ళిపోయింది. ఇల్లు గుర్తు పెట్టుకుని, రంగనాథం తన దారిన తను పోయాడు.

ఆ రాత్రి రంగనాథానికి, భారతికి కూడా ఒకరినొకరు మళ్ళీ చూడాలనిపించటం, చిక్కటి ఆలోచనలు, తరువాత చక్కటి కలలూ వచ్చినై. అటుపైన ఒకరినొకరు మళ్ళీ కలుసుకుంటే బాగుండును, తెలుసుకుంటే బాగుండును అనుకున్నారు కూడా అంతరంగాల్లో.

రంగనాథం మర్నాటి రాత్రి టీ తాగొచ్చి చదువుకుందామని బయల్దేరినవాడు, భారతి గుర్తుకు వస్తే, ఆగలేక వాళ్ళ రోడ్డుమీదుగా హోటలుకు నడక సాగించాడు. వాళ్ళ డాబా సమీపిస్తూ వుంటే, శ్రవణానందంగా వీణానాదం వినిపించి, మనిషిని నిలేసింది. ఆనందంగా అరగంట, ఎవరూ పట్టించుకోని విధంగా నిలబడుతూ కాస్సేపు చిన్నచిన్న పచార్లు చేస్తూ కాసేపు గడిపిన తర్వాత సంతోషంగా రూముకు చేరాడు, భారతిని హృదయంలో పదిలపరుచుకుంటూ.

మూడో రోజు మధ్యాహ్నం, రంగనాథం మేనమామ, అత్తయ్య, బావ గోపీనాథ్‌లు బరంపురం నుంచి వచ్చి అతని గదిలోనే దిగారు. గోపీనాథ్ పెళ్ళి చూపులని, పెళ్ళి కూతురు బంధువొకాయన వాళ్ళకు సంబంధం చెప్పి వాళ్ళను తీసుకు వచ్చాడని చెప్పారు.

ఊళ్ళోనే పెళ్ళికూతురు వుంది, పెళ్ళి చూపులకు నలుగురం వెళదాం, నాలుగున్నరకు ఆ బంధువొచ్చి మనల్ని తీసుకు వెళతాడు, అన్నాడు మేనమామ. అప్పటివరకు సరదాగా అందరూ కబుర్లాడుకున్నారు.

పెళ్ళికూతురు బంధువు తెచ్చిన టాక్సీలో అందరూ బయల్దేరారు. పెళ్ళికూతురు ఇంటి ముందు టాక్సీ ఆగగానే, రంగనాథానికి మనసు ఆందోళన చెంది, గుండె దడదడలాడటం మొదలెట్టింది. ఆ యిల్లు తను కలలు కంటున్న ప్రియురాలిది మరి. తన దేవతను గోపీ బావ ఎత్తుకుపోతున్నట్లే అనిపించింది. గోపీతో పెళ్ళికూతురు నీ చెల్లెలవుతుంది బావా అనలేదు మరి!

పెళ్ళికొడుకు బృందం కారు దిగి యింట్లోకి వస్తూ వుంటే, చాటు నుంచి చూస్తున్నవాళ్ళలో వున్న భారతికి కూడా రంగనాథాన్ని చూడటంతో, ఆతని పరిస్థితే ఏర్పడింది, అతనే పెళ్ళికొడుకనుకోవటంతో.

చూపుల తతంగం ముందు భారతి

ఫలహారాలు తెచ్చింది. అందరికీ అందిస్తూ వుంటే, ఆమెను తన కూతురుగా పెండ్లి కుమార్తె మేనమామ పరిచయం చేశాడు. తల్లి దండ్రుల మధ్య కూర్చున్న వేరే అతను పెండ్లికొడుకుగా గ్రహించిన భారతి, భారతి పెండ్లికూతురు కాదని అర్థం చేసుకున్న రంగ నాథం, ఇద్దరూ ఆనందపడిపోయి, ఒకరి నొకరు పెళ్ళి పెద్దలలాగే ధైర్యంగా చిరు నవ్వులతో చూసుకున్నారు. ఆ సందర్భంలోనే, రంగనాథం మేన మామ, రంగనాథాన్ని తన మేనల్లుడుగా పరిచయం చేస్తూ, ఆ వూళ్లోనే అతను లా ఫైనలియరు చదువుతున్నట్లు చెప్ప టం, భారతి తండ్రి "అయితే వరుస కూడా కుదురుతుంది, మా అమ్మాయిని అతనికి చేసుకోండి, బి.ఏ. ఫైనలియరు చదువుతోంది" అనటంతో, అందరు గట్టిగా నవ్వేశారు, నిజమేనంటూ. అది విన్న భారతి లోపలికి తుర్రుమని మళ్ళీ బయటకు రాలేదు.

అలాగా భారతీ రంగనాథంల చిరునగ వులు కదలికలు కనిపెట్టిన తెలివితేటలతో వేరే పెళ్ళిచూపులు కూడా అఖ్ఖర్లేదు. ఇప్పుడే వాళ్ళు ఒకరినొకరు చూసుకున్నారు. మా వదినెగారికి నేను చెప్పేస్తాను, రంగనాథానికి కూడా గోపీ పెళ్ళితోపాటు పెళ్ళి చేయమనీ, ఆ పెళ్ళికూతు రును కూడా చేసి వచ్చామనీ" అంది, రంగ నాథం అత్తయ్య.

మొత్తానికి సరదాగానే అన్ని విషయాలు, అటు వారు, యిటు వారు, తరువాత యింకో రెండుసార్లు కలుసుకోవటంతో, నెల రోజుల్లో రెండు పెళ్ళిళ్ళు ఘనంగానే జరిగిపోయాయి.

❋ ❋ ❋

భారతి రంగనాథం వున్న గదిలోకి పాల గ్లాసుతో తొలిరాత్రి ప్రవేశించి, సిగ్గుసీను, పాలు పుచ్చుకోవటాలు అయిన తరువాత –

"మీరు టెన్నీసు బాగా ఆడతారన్నమాట, టోర్నమెంట్సులో కూడానా?" అంది నవ్వుతూ.

"నా మొహం! నాకు టెన్నీసే రాదు, టోర్న మెంట్సు కూడానా?" అన్నాడు నవ్వుతూనే రంగనాథం.

అతడు కావాలనే, సరదాగా అబద్ధమాడు తున్నాడనుకున్న భారతి, అప్పటికే చనువేర్ప డడంతో, హాస్యంగా –

"అయితే టెన్నీస్ ర్యాకెట్ సైకిలుకు తగిలించుకుని, రోడ్లమీద ఆడపిల్లల్ని ఫాలో అవుతూ, చెమట్లు పట్టేటంత వరకు నాలుగు రోడ్లు స్టైలిష్‌గా తిరిగి, రూముకెళ్ళి స్నానం చేసేవారన్న మాట" అని గట్టిగా నవ్వింది.

"అటువంటివాడ్ని కాదే! పైగా నాకు ర్యాకెట్టే లేదు, సైకిలుకు తగిలించుకోవడం కూడానా?" ఆశ్చర్యపోతూ అన్నాడు.

"మరి నేను మిమ్మల్ని మొదట్లో చూసిన ప్పుడు మీ సైకిలుకు ర్యాకెట్ వుందే" అంది చిరునవ్వుతో.

"చచ్చాం పో అదా! అది మా ఫ్రెండు ఆ రోజున సినీమాకు వెళుతూ దాన్ని నా రూంలో పడెయ్యమన్నాడు"

"మరి దాన్ని చూసే మిమ్మల్ని నేను పెళ్ళి చేసుకున్నా" అంది కొంటెగా.

ఆమె ముఖకవళికల్లో చింతన భావం ఏమీ కనిపించక, చిరునవ్వే తాండవించటంతో, అతనికి ఆనందమే కలిగింది.

"అది నీ దురదృష్టం! మరి నా అదృష్టం చూడు! నీ ఒళ్ళో వీణను చూసి నిన్ను మోహించా. ఇల్లు చూడాలనిపించి ఫాలో అయ్యా. మర్నాటి రాత్రి బ్రహ్మాండంగా నువ్వు వాయిస్తూ వుంటే, దొంగతనంగా విని ఆనందించా" అన్నాడు నవ్వుతూ.

"అదా సర్లెండి! మా ఒదిన రమ వాయిస్తూ వుంటే విన్నారన్నమాట. మా స్నేహితురాలు శ్యామల యింటి నుంచి, ఒదిన కోసం తెస్తూ వుంటే వీణను చూశారు, నేను ర్యాకెట్ చూసినట్లు. మీరు టెన్నీస్ ఆడటం, నేను వీణ మీటటం ఒకటే అన్నమాట. మరి వీణను చూసే పెళ్ళి చేసుకున్నారా నన్ను?" ఈ తడవ నవ్వు ఆశ్చర్యాలతో అంది.

"కాదు. నీకు వీణ రాకపోవటం కూడా నాకు అదృష్టమే. లేకపోతే టెన్నీస్ ప్లేయర్‌లాగ నటించి, మోసం చేసినట్లు కేసుపెట్టేదానివి"

"మీరు తక్కువా? అసలే లాయరు కాబోతున్నారు. నా మీద వీణతో మోసం చేసినట్లు కేసు బనాయించేవారు."

"బాగానే వుంది మన వాదన! నేను టెన్నీసు, నువ్వు వీణ ఎప్పుడు నేర్చుకున్నా నేర్చుకోవచ్చుగానీ, మన ఇప్పటి ప్రోగ్రామ్... అమాయకత్వం మూర్తీభవించినట్లు ముఖం పెట్టి అడిగాడు.

"ఇదే" నంటూ రంగనాథం నోటికి ద్రాక్ష గుత్తి అందించింది, భారతి కిలకిల నవ్వుతూ. ✵

## మధుర గాయని జిక్కి మరిక లేరు



**తే**నెలొలికే తెలుగు పాటల కోయిల జిక్కీ తన 70వ ఏట, చెన్నైలో కేన్సర్ వ్యాధి మూలంగా ఆగస్టు 16న మర ణించారు.

మొదట్లో చదువుకోకపోయినా, లయ జ్ఞానం చక్కని పరిశీలన, జ్ఞాపకశక్తి వరా లుగా పొందిన జిక్కి, పంతులమ్మ సిని మాలో తన పాత్రను, ఆ పాత్రకు తగిన పాటను ఆమే పాడారు. ఆ తరువాత తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, మరాఠీ, హిందీ భాషలలో పదివేలకు పైగా పాటలు పాడారు. అనార్కలి చిత్రం లోని 'రాజశేఖరా..", సువర్ణ సుందరి లోని "హాయి హాయిగా ఆమని సాగే...", పెళ్ళి కానుకలో "వినిపించని మది విని పించె"– అలాగే ప్రతి పాటా వీనుల విందుగా పాడి తెలుగువారి హృదయాల్లో శాశ్వతంగా నిలచేలా చేసారు. చెంచు లక్ష్మిలోని "చెట్టులెక్కగలవా! ఓ నరహరి పుట్టలెక్కగలవా..." ఇలా ప్రతి పాటా ఆపాతమధురంగా పాడారు. ప్రముఖ గాయకుడు ఎ.ఎం. రాజాను వివాహ మాడారు.

జిక్కి ఆత్మకు శాంతి కలగాలని, మరోసారి జన్మించి ఆంధ్రులు ఆజ న్మాంతం మరవలేని అద్భుతమైన పాట లను అందించాలని భగవంతుని ప్రార్థించుదాం.